ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 26 సెప్టెంబరు 2024

బల్దియాల్లో లెక్కలేనితనం



- రూ. 31.37 కోట్ల నిధులకు లెక్కలు లేవు.. పత్రాలు లేవు
- సమధానాలు ఇవ్వని అధికారులు
- అయిదు మున్సిపాలిటీల్లో నిధుల వ్యయంపై ఆడిట్ అభ్యంతరాలు
- నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్న వైనం

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీల్లో లెక్కలపై ఆడిట్‌శాఖ అభ్యంతరాలపై పట్టింపు లేకుండా పోయింది. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాలిటీల్లో నిర్వహించిన ఆడిట్‌లో నిర్వహణ లోపాలను ఎత్తిచూపడం, వందల సంఖ్యలో అభ్యంతరాలు, రూ. కోట్లలో లెక్కలు, పత్రాలు లేకపోవడాన్ని అధికారులు గుర్తించారు. ఆయా పాలకవర్గాల నిర్లక్ష్య వైఖరిని ఆడిట్ బహిర్గతం చేసింది. ప్రతీ సంవత్సరం మున్సిపాలిటీల్లో ఖర్చులపై ఆడిట్ జరుగుతుంది. నిధుల దుర్వినియోగం, లెక్కల్లో తేడాలు, నిబంధనలకు వ్యతిరేకంగా చేసే ఖర్చుల వివరాలను ప్రభుత్వానికి ఆడిట్‌శాఖ నివేదిస్తుంది. సంబంధిత ఆడిట్ అభ్యంతరాలను క్లియరెన్స్ చేసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం విమర్శలకు గురిచేస్తోంది. ఆడిట్ అభ్యంతరాలు కేవలం కాగితాలకే పరిమితమమవుతున్నాయి. ఫలితంగా ప్రజాధనం వ్యయం ఇష్టారీతిగా జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● 846 అభ్యంతరాలు..

జగిత్యాల జిల్లాలోని అయిదు మున్సిపాలిటీలకు సంబంధించి రూ. 31,37,76,352 నిధులకు సంబంధించి ఆడిట్‌శాఖ అభ్యంతరాలు లేవనెత్తింది. జిల్లాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలోపు పూర్తయిన ఆడిట్‌లో 846 అభ్యంతరాలను అధికారులు తెలిపారు. ఇందులో 2019-20 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 209 ఆడిట్ అభ్యంతరాల్లో 5,71,04,758 రూపాయలు, 2020--21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 201 ఆడిట్ అభ్యంతరాల్లో 5,18,47,322 రూపాయలు, 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 205 ఆడిట్ అభ్యంతరాల్లో 9,16,23,612 రూపాయలు, 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 191 ఆడిట్ అభ్యంతరాల్లో 11,32,00,659 రూపాయల అభ్యంతరాలను ఆడిట్ శాఖ గుర్తించింది.

● గడువు ముగిసినా అందని సమాధానాలు..

జిల్లాలోని ఆయా మున్సిపాలిటీ అధికారుల వద్ద ఆడిట్ అభ్యంతరాలపై సమాధానం కొరవడింది. గడువు ముగిసినా సమాధానాలు ఇవ్వడం లేదు. వివిధ మున్సిపాలిటీల్లో నిధులు వ్యయంపై అసిస్టెంట్ ఆడిట్ అధికారులు ఆడిట్‌చేసి ఆడిటర్‌కు సమర్పిస్తారు. ఆయన ఆడిట్‌ను అరుక్యాకన్సాలిడేటెడ్ చేసి అభ్యంతరాలు గుర్తిస్తారు. ఆడిట్ అభ్యంతరాలను ఆయా మున్సిపాలిటీలకు తెలియజేస్తారు. అభ్యంతరా లను సరిదిద్దుకునేందుకు నాలుగు నెలల గడువు ఉంటుంది. పరిష్కరిం చుకునే వీలుంది. లెక్కల్లో వ్యత్యాసం ఉండటం నగదు పుస్తకానికి, ట్రెజరీ, బ్యాంకు పాసుపుస్తకానికి తేడా ఉండటం, నిధులు ఎక్కువగా ఖర్చు చేయడం, నిధుల మళ్లింపు, నిధులు ఖర్చు చేయకపోవడం, బకాయిలు వసూలు చేయకపోవడం, నిబంధనలు అతిక్రమించడం తదితరాలన్నిం టిని ఆడిట్ అభ్యంతరాలుగా పరిగణిస్తారు. అయితే సంబంధిత అభ్యం తరాలకు తగిన లెక్కలు, పత్రాలు చూపుతూ వివరణ ఇవ్వాల్సిన మున్సిపల్ అధికారులు పట్టింపులేని దోరణితో వ్యవహరిస్తున్నారు.

● నోటీసులకే పరిమితం..

వివిధ పనులకు రూ. కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రభుత్వం చెబుతోంది. పకడ్బందీగా ప్రగతి పనులు చేస్తున్నట్లు ఆయాశాఖల అధికారులు చెబుతున్నారు. నిధులు ఖర్చు చేయకున్నా చేసినట్లు తప్పుడు లెక్కలు చూపడం.. అడ్వాన్సుల రూపంలో రూ. లక్షలు ఖర్చు చేయడం, రూ. పదిలక్షల విలువైన పనులకు రూ. పన్నెండు లక్షలు వెచ్చించామని చెప్పడం.. వంటి ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తుంటాయి. పనులు పారదర్శకంగా ఉండడానికి ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల్లో ప్రజాధనం వెచ్చించి చేపట్టిన పనులకు ఎప్పటికప్పుడు ఆడిట్ చేయిస్తోంది. సంబంధిత ఆడిట్‌లో గుర్తించిన అభ్యంతరాలకు లెక్కలు, పత్రాలు చూయించాల్సి ఉంటుంది. అయితే జగిత్యాల జిల్లాలోని మున్సిపాలిటీల్లో రూ.కోట్లలో చేపట్టిన నిధులకు సంబంధించిన లెక్కలు, పత్రాలు అప్పజెప్ప కుండా పలు ప్రభుత్వశాఖలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. అసలు నిధుల వ్యయం జరిగిందా.. ఎంతవరకు నిబంధనలను పాటించారూ అన్న సమాధానాలు ఆడిట్ అధికారులకు అందించడం లేదు. లెక్కలు, పత్రాలు అందించినా.. లేకున్నా.. మాకేమీ కాదులే అన్నట్లుగా సంబంధిత శాఖల అధికారులు వ్యవహరిస్తున్నారు. అధికారులు నోటీసులు అందించి చేతులు దులుపుకుంటుండడంతో అభ్యంతరాలు పరిష్కారం కావడం లేదు.

● పత్తాలేని జిల్లా స్థాయి ఆడిట్ కమిటీ..

జిల్లాలో పలు ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్న ఆడిట్ ప్రక్రియ, అభ్యంతరాలు, పరిశీలనలు, ఆడిట్ క్లియరెన్స్‌లపై చర్చించడానికి ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి ఆడిట్ కమిటీ పత్తా లేకుండా పోయింది. జిల్లాస్థాయి ఆడిట్ కమిటీ సమావేశాలు నిర్వహించకపోవడం వల్ల ఆడిట్ అభ్యంతరాల గురించి పట్టించుకునే వారు కరువయ్యారు. ఒకవేళ ఆడిట్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ అవి కాగితాలకు మాత్రమే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలున్నాయి. ఆడిట్ అభ్యంతరాలపై సరైన పత్రాలతో కూడిన వివరణను ఆడిట్ బృందానికి అందజేయాల్సిన సంబంధిత శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆడిట్ అభ్యంతరాలను పూర్తిస్థాయిలో పరిష్కరించడంలో ఉన్నతాధికారు లు విఫలమవుతున్నారు. కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఆడిట్ కమిటీ సమావేశాన్ని నిర్ణీత గడువులోగా ఎప్పటికప్పుడు నిర్వహించాలన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఆడిట్ అభ్యంతరాలను పరిష్కరించుకోవాలి



జిల్లాలో ఇప్పటివరకు ఆయా మున్సిపాలిటీల్లో అధిక సంఖ్యలో ఆడిట్ అభ్యంతరాలు వచ్చాయి. ఆయా మున్సిపాలిటీలకు ఎప్పటికప్పుడు ఆడిట్ అభ్యంతరాలు పంపాం. ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు ఆడిట్ అభ్యంతరాలను తగిన ఆధారాలతో స్టేట్ ఆడిట్, జిల్లా ఆడిట్ అధికా రులను సంప్రదించి పరిష్కరించుకోవాలి. పెండింగ్‌లో ఉన్న ఆడిట్ అభ్యంతరాలకు గతంలోనే నోటీసులు జారీ చేశాము. సంబంధిత అధికా రులు నిర్లక్ష్యం చేయకుండా అభ్యంతరాలను పరిష్కరించుకోవాల్సి ఉంది.

- సుజాత, జిల్లా ఆడిట్ అధికారి

ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీక్లీ బజార్‌లో గల ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, పరిసరాల పరిశుభ్రత, వసతులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో పరిస్థితిని పరిశీలించారు. పాఠశాలలో శానిటేషన్, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు తాగునీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్, టీపీసీసీ నాయకులు బండ శంకర్, నాయకులు దేవేందర్‌రెడ్డి, కౌన్సిలర్ దుర్గయ్య, మాజీ కౌన్సిలర్ పులి రాము. ఎలిగేటి నర్సయ్య, నాయకులు మధు, గంగాధర్, సతీష్, నరేశ్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రానికి అనుమతి కోరుతూ ఎమ్మెల్సీ లేఖ

రాయికల్, సెప్టెంబరు 25: రాయికల్ మండలంలోని అల్లీపూర్ రైతుమిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం చేయడానికి అనుమతి కోరుతూ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి బుధవారం అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, జిల్లా సివిల్ సప్లై అధికారి, జిల్లా వ్యవసాయాధికారికి వినతి పత్రం పంపించారు. ఈ విషయమై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి రైతుమిత్ర ఫార్మర్స్ కంపెనీ సభ్యులు దాన్యం కొనుగోలు కేంద్రం మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై జీవన్‌రెడ్డి స్పందించారు. రైతుమిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీకి అనుమతి కల్పించి రైతులకు వెసులుబాటు కల్పించాలని కోరారు.

వృద్ధుల శ్రేయస్సు, గౌరవం పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25: అంతర్జాతీయ వయోవృద్ధుల వారోత్సవాలను పురస్కరించుకుని బుధవారం వయోవృద్ధుల శ్రేయస్సు, ప్రేమ, గౌరవం గురించిన పోస్టర్, పోషణ, సంక్షేమ నియమావళి బుక్‌లెట్స్‌ను కలెక్టర్ సత్యప్రసాద్ ఆవిష్కరించారు. అక్టోబరు 1 వరకు వారం రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలు ప్రణాళిక ప్రకారం నిర్వహించాలని అదికారులను కలెక్టర్ ఆదేశించారు. 26న వృద్ధాశ్రమాల్లో వృద్ధుల క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, ఆరోగ్య సంరక్షణపై అవగాహన సదస్సు, 29న పంచాయతీ కార్యదర్శులకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టంపై అవగాహన, 30న అంగన్‌వాడీ కేంద్రాల్లో, పాఠశాల గ్రౌండ్స్‌లో పేరెంట్స్ నిర్వహణ, అక్టోబరు 1న జిల్లా స్థాయి అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవంతో కార్యక్రమం ముగుస్తుందని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేష్, ఆర్డీవో మధుసూదన్, డీఆర్‌డీవో రఘువరణ్, వృద్ధుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో పడకలు పెంచాలి

- సమస్యలపై సీఎం రేవంత్‌కు నివేదిస్తా
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యకు అనుగుణంగా పడకలు పెంచాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల పరిశీలన కోసం బీఆర్‌ఎస్ ఓ అధ్యయన కమిటీని ఏర్పాటు చేయగా.. కమిటీ సభ్యుడైన ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ బుధవారం పట్టణంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిని, మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో ఓపీ చాంబర్‌ను, ఇన్ పేషంట్ల గదులను, మందులు ఇచ్చే గదులను, ల్యాబ్, ఎక్స్‌రే తదితర గదులను పరిశీలించారు. పలువురు రోగులు, రోగుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎదరవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడారు. ఆసుపత్రులను సందర్శించి రోగుల అవస్థలు, సమస్యలను పరిశీలిస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో గతంలో మాదిరిగానే కేసీఆర్ కిట్లను అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల కు అవసరమైన మందులు పంపిణీ చేయడం లేదన్నారు. ఆసుపత్రిలో ఓపీ ఎక్కువగా ఉన్నాయని, పడకలు సరిపోవడం లేదని, వరండాలో సైతం పడకలు వేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆసుపత్రిలో నెలకొన్న జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై సీఎం రేవంత్‌కు నివేదికిస్తానన్నారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసి ప్రభుత్వ ఆసుపత్రులల్లో నెలకొన్న లోపాలపై వివరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ రాము లు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్, బీఆర్‌ఎస్ నాయకులు మారు సాయిరెడ్డి, డాకూరి వెంకటేశ్, గుంటి దేవయ్య పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం

పెగడపల్లి, సెప్టెంబరు 25: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లి గ్రామశివారులోని కెనాల్ నుంచి రంగదామునిపల్లి వరకు లింక్ రోడ్డు నిర్మాణం, దోమకుంట బతుకమ్మ చెరువు వరకు ఫార్మేషన్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని దానికి గాను నిధులు మంజూరు చేయించాలని కోరుతూ ఆ గ్రామస్థులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ఈ మేరకు నిధులు మంజూరుకు సానుకూలంగా స్పందించి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమిరిశెట్టి లక్ష్మీనారాయణ, కడారి తిరుపతి, కట్ల శ్రీనివాస్, నీరటి రాజేందర్, దీకొండ మహేందర్, రమేష్, లింగయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సారంగాపూర్, సెప్టెంబరు, 25: విద్యార్థులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాల్ రమేష్ బాబు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమం తప్పకుండి కాలేజికి వచ్చేల పోత్సహించాలని కళాశాలకు వచ్చేటప్పుడు లంచ్ బాక్సు పంపించాలని విద్యార్తులకు ఎట్టి పరిస్థితుల్లో మొబైల్ ఫోన్ వెంట తీసుకు రాకుండా చూడాలని పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, పోషకులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారానికి కృషి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న విప్, ఎమ్మెల్యే తదితరులు

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో గల ఆడిటోరియంలో జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు తర్వాత తొలిసారిగా కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. జిల్లాలో వివిధ స్థాయిల్లో పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పరిష్కరించడానికి అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిహారంలో ఎటువంటి జాప్యం లేకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ నిధుల నుంచి జిల్లాకు నిధులు తీసుకవస్తానన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్, జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కమిటీ సభ్యులు టీవీ సూర్యం, జగిత్యాల ఆర్డీవో మదుసూదన్, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్, సాయిబాబా, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో జగిత్యాల పేరు నిలబెట్టాలి

జగిత్యాల క్రైం: పాఠశాల స్థాయి నుంచే ఆటల పోటీల్లో ప్రతిభను చాటుతూ జగిత్యాల పేరును రాష్ట్ర స్థాయిలో నిలబెట్టేలా ప్రతి క్రీడాకారుడు కృషి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో జిల్లా స్థాయి పాఠశాలల ఆటల పోటీలు రెండోరోజు కొనసాగాయి. ఈ సందర్భంగా ఆటల పోటీలకు హాజరైన క్రీడాకారులకు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి సదుపాయాన్ని కల్పించారు. విప్‌తో పాటు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి హాజరై క్రీడాకారులకు భోజనాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రెండోరోజు అండర్-17 బాలుర విభాగంలో పోటీలు హోరాహోరీగా జరిగాయి. వాలీబాల్‌లో వెల్గటూర్ విన్నర్‌గా నిలవగా, సారంగపూర్ మండల జట్టు రన్నర్‌గా నిలిచింది. కబడ్డీ పోటీల్లో కోరుట్ల విన్నర్‌గా నిలవగా, జగిత్యాల అర్బన్ రన్నర్‌గా, ఖోఖో పోటీల్లో కోరుట్ల విన్నర్‌గా నిలవగా, మేడిపెల్లి జట్టు రన్నర్‌గా నిలిచిందని జిల్లా విద్యాధికారి జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను చైర్‌పర్సన్ జ్యోతి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో వివిధ మండలాల పీఈటీలు, నిర్వాహకులు తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజం

- కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాది అని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. బుధవారం పట్టణంలో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ ర్యాలీని కలెక్టర్ సత్యప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ఓల్డ్ హైస్కూల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ తహసీల్ చౌరస్తా మీదుగా పాత బస్టాండు వరకు నిర్వహించి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ్ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు 15 రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ రఘువరన్, జిల్లా సంక్షేమ అధికారి బోనగిరి నరేశ్, ఆర్డీవో మధుసూదన్, జిల్లా ఎఫ్ఎల్‌సీ కోట మధు సూదన్, వివిధ బ్యాంకుల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి

రాయికల్: ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ బి సత్యప్రసాద్ సూచించారు. మండలంలోని ఒడ్డెలింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓపీ సేవలు, ఐపీ సేవలు, రికార్డ్స్, ల్యాబ్ రికార్డ్స్, ఐపీ రికార్డులు, మెడికల్ ఫార్మసీలను పరిశీలించారు. ఆస్పత్రిలో వైద్యసేవలను మెరుగుపరచాలని, రోజుకు ఎన్ని ఓపీలను చూస్తున్నారు, ఆస్పత్రిలో పేషెంట్లకు శుభ్రమైన తాగునీరు అందిస్తున్నారా అని తెలుసుకున్నారు. డెంగ్యూ, ఇతర వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో వ్యాధులపై అప్రమత్తమైన పేషెంట్లకు ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు కల్పించాలని సూచించారు. అనంతరం ఆస్పత్రి పరిసరాలను పరిశీలించి చుట్టుపక్కల ఉన్న పిచ్చి మొక్కలను తీసివేయించాలని, ఆస్పత్రి పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి శానిటేషన్ చేయించాలని అధికారులను ఆదేశించారు. జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, తహసీల్దార్ ఖయ్యూం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

రోడ్డుపై 'భగీరథ' నీరు

మల్యాల, సెప్టెంబరు 25: మల్యాల బ్లాక్ చౌరస్తా ప్రధాన రహదారిపై మిషన్ భగీరథ పైపులు పగిలిపోయి నీరు వృథాగా వెళ్లాయి. మల్యాలకు సరఫరా చేసే ప్రధాన పైప్‌లైన్ పైపులు బుధవారం వేకువజామున పగలడంతో రహదారి నీటితో నిండిపోయింది. నీటి సరఫరా నిలిపి త్వరగా పైపుల పనులు పునరుద్ధరించకపోవడంతో రోజంతా నీరు వృథాగా వెళ్లింది.



పైపు పగిలి రహదారిపై ప్రవహిస్తున్న నీరు

వ్యవసాయ శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పర్యటన

● వరిలో తెగుళ్ల నివారణపై రైతులకు అవగాహన

గంగాధర, సెప్టెంబరు 25: వరి గొలక దశలో ఆశిస్తున్న తెగుళ్ల నివారణకు వ్యవసాయ అధికారుల సిఫారసుతో మందులు పిచికారి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మీ అన్నారు. బుధవారం గంగాధర మండలం నారాయణపూర్, కురిక్యాల, గట్టుబూత్కుర్ గ్రామాల్లో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, డీఏవో, ఏడీఏలు వరి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఎక్కువగా బ్యాక్టీరియా, ఎండు తెగులు, దోమపోటు, కంకినల్లి, పాము పొడ తెగులు, సన్న రకం వరికి ఆకునల్లి, కంకినల్లి సోకుతున్నట్లు గుర్తించి రైతులకు తగిన సహాలు, సూచనలు అందించారు. పూత దశలో ఉన్న వరికి కాపర్ సంబంధిత మందులు వాడరాదని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాస్, ఏఈవోలు గోపీచంద్, వెంకటస్వామి, వంశీధర్, రమ్య పాల్గొన్నారు.



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

పొంచి ఉన్న ప్రమాదం



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న చెట్టు

శంకరపట్నం, సెప్టెంబరు 25: శంకరపట్నం మండలం జాతీయ రహదారి నుంచి మొలంగూర్ గ్రామంలోకి వెళ్లే దారిలో కావేరి సీడ్ ప్లాంట్ సమీపంలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు ప్రమా దకరంగా ఉంది. ఆ చెట్టు విరిగి పడితే రోడ్డుపై వెళ్లే ప్రజలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రమాదం సంభవించక ముందే చెట్టును తొలగించా లని ప్రజలు కోరుతున్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులు మంజూరు చేయాలి

గంగాధర, సెప్టెంబరు25: దీర్ఘకాలం పెండింగ్‌లో ఉన్న ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను మంజూరు చేయాలని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తముల తిరుపతి డిమాండ్ చేశారు. బుధవారం గంగాధర ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆయన మాట్లాడుతూ సీనియారిటీ గల ఎస్జీటీలకు గత జీవోలను సవరించి బీఈడీ అర్హత ఉన్న వారికి పదోన్నతి కల్పించాలన్నారు. సంవత్సరకాలంగా పెండింగ్‌లో ఉన్న సరెండర్ లీవు, మెడికల్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదికను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ కిషన్‌రెడ్డి, పెరుక నర్సయ్య, జిల్లా నాయకులు సముద్రాల అంజయ్య, గంగాధర మండల నాయకులు పాల్గొన్నారు.

వెంటాడిన విషాదం

- అనారోగ్యంతో కుటుంబ పెద్ద మృతి
- మృతదేహాన్ని ఇంటికి తీసుకురానివ్వని ఇంటి ఓనర్
- గ్రామ శివారులోనే మృతదేహం
- గ్రామస్థుల సాయంతో అంత్యక్రియలు పూర్తి


మృతుడి కూతుళ్లకు ఆర్థిక సహాయం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు


కోట లక్ష్మణ్ (ఫైల్)

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 25 : ఇంటి పెద్దాయన కష్టం చేస్తే తప్ప కడుపు నింపని ఆ కుటుం బంపై విధి పగబట్టింది. హుజూరాబాద్ మండలం ధర్మరాజుపల్లి గ్రామానికి చెందిన కోట లక్ష్మణ్(55), ప్రేమలత దంపతులు గ్రామంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటూ కూరగాయలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా వివాహం చేశారు. మంగళవారం లక్ష్మణ్ అకస్మాతుగా కిందపడిపోయాడు. గమనించిన భార్య గ్రామస్థుల సహకారంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించారు. మెదడులో రక్తం గడ్డ కట్టడంతో మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొస్తున్న క్రమంలో ఇంటి యజమాని మృతదేహాన్ని తీసుక రావద్దంటూ ఆదేశించడంతో గ్రామ శివారులో మృతదేహాన్ని ఉంచారు. అంత్యక్రియలు చేసేందుకు కూడా చేతిలో డబ్బులు లేక భార్య ప్రేమలత దిక్కుతోచని స్థితిలోకి వెళ్లింది. మృతుడి కుటుంబాన్ని ఆదుకునేందుకు గ్రామస్థులందరూ ముందుకు వచ్చి తలాకొంత పోగుచేసి రూ. 80వేల ఆర్థికసాయం అందించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అంత్యక్రియల కోసం కాంగ్రెస్ నాయకుల ద్వారా ఆర్థిక సాయం అందించి ఆ కుటుంబానికి అండగా నిలిచారు.

రూ.7,600 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబరు 25: జమ్మికుంట వ్యవ సాయ మార్కెట్‌లో క్వింటాల్ పత్తిధర రూ.7,600 పలికింది. బుధవారం మార్కెట్ యార్డుకు 30 మంది రైతులు 149 క్వింటాళ్ల విడి పత్తి, 11 మంది రైతులు 154క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,600, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

అంతర్జాతీయ క్రికెట్ పోటీకి ఎంపిక

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 25 : మారుమూల పల్లె నుంచి అంతర్జాతీయ క్రికెట్ పోటీకి అండర్ 19 విభాగంలో యువకుడు ఎంపికయ్యాడు. మండలంలోని ఎదులాపూర్ గ్రామానికి చెందిన బోల్లా సాహితికుమార్, హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్నాడు. క్రికెట్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినందుకు ప్రతిభను గుర్తించిన ఎంఎస్‌సీ క్రికెట్ అకాడమీ హైదరాబాద్ వారు అండర్ 19విభాగంలో అక్టోబర్ 20 నుంచి 29వరకు శ్రీలంకలోని కొలంబోలో జరగనున్న ఇంటర్నేషనల్ క్రికెట్ పోటీకి ఎంపిక చేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ముస్తాబాద్, సెప్టెంబరు 25 : మండలంలోని చిప్పలపెల్లి శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సీహెచ్ గణేశ్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఆవునూర్ ఎగువ మానేరు వాగు నుంచి ఐదు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేశామని తెలిపారు.

మృతదేహం లభ్యం

తిమ్మాపూర్, సెప్టెంబరు 25 : మండలంలోని కొత్తపల్లి మోయతుమ్మెద వాగులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఎల్ఎండీ పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపల్లి గ్రామం వద్ద మోయతుమ్మెద వాగులో బుధవారం చుట్టి ఉన్న కవర్‌లో ఓ మృతదేహం కొట్టుకుపోతుండగా జాలర్లు గుర్తించి బయటికి తీశారు. మృతుడి వయస్సు సుమారు 45 నుంచి 50 సంవత్స రాల వరకు ఉంటుంది. మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండటంతో అక్కడే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిర్వహించారు. కొత్తపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వడ్లూరి అనిల్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

యథేచ్ఛగా కలప అక్రమ రవాణా

- అనుమతులు లేకుండా చెట్ల నరికివేత
- పట్టించుకోని అధికారులు


జంగపల్లిలో అక్రమంగా నిలువ ఉంచిన కలప

గన్నేరువరం, సెప్టెంబరు 25 : మండలంలోని వివిధ గ్రామాల్లో అనుమతులు లేకుండా యథేచ్ఛగా చెట్లను నరికివేస్తూ కలపను అక్రమంగా రవాణా చేస్తున్నారు. కలప వ్యాపారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే గ్రామాలలో రైతుల వద్ద చెట్లను కొనుగోలు చేసి ఇష్టారాజ్యంగా చెట్లను నరికివేసి లారీలలో లోడ్ చేసి తరలిస్తున్నారు.

జంగపల్లి గ్రామంలో స్మశాన వాటిక పక్కన పెద్ద ఎత్తున కలప నిల్వ చేశారు. ఇక్కడి నుంచి లారీలలో తరలిం చి సొమ్ము చేసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా చెట్లు నరికివేస్తూ అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీసులు కలప అక్రమ రవాణాను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఒకవైపు అధికారులు హరితహారం కార్యక్రమంలో మొక్కలను నాటుతుంటే కలప వ్యాపారులు అక్రమంగా చెట్లను నరికివేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి అక్రమంగా కలప అక్రమ రవాణాను నివారించాలని కోరుతున్నారు.

చిన్న దేవాలయాల ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయాలి


● టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్


ఆలయ ఉద్యోగుల సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్రంలో పెద్ద దేవాలయలైన వేములవాడ, యాదాద్రి, భద్రాచలం ఆలయాల మాదిరిగానే చిన్న దేవాలయాలైన కొమురవెల్లి, కొండగట్టు, బాసర దేవాలయాల ఉద్యోగులకు సైతం పీఆర్సీ అమలు చేయాలని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. బుధవారం వేములవాడ పట్టణంలో నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఆలయాల ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, రాష్ట్ర జేఏసీ చైర్మన్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ మాట్లాడుతూ 261 జీవోను సవరించాలని, ఉద్యోగులందరికీ న్యాయం చేయాలని అన్నారు. పని గంటలతో నిమిత్తం లేకుండా అవసరానికి మించి ఉద్యోగులు పని చేశారని గుర్తు చేశారు. ఆలయాల్లో భక్తుల సంఖ్య ఎక్కువ ఉన్నందున క్యాడర్ స్ట్రెంత్ లేకపోవడంతో దేవాలయ ఉద్యోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. క్యాడర్ స్ట్రెంత్ పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఔట్ సోర్సింగ్ కాంట్రాక్ట్ పద్ధతిని తొలగించి అందరినీ రెగ్యులరైజ్ చేయాలని కోరారు. 317 జీవో తీసుకొచ్చి జోనల్ వ్యవస్థలో బదిలీలు చేసి ఇబ్బందులకు గురి చేశారన్నారు. స్పౌస్‌లో కూడా ఇష్టారీతిన బదిలీలు చేశారని విమర్శించారు. వ్యవసాయ శాఖలో ఏఈవోలకు పనిభారం అధికంగా ఉందని, హాస్టల్ వెల్ఫేర్, పంచాయతీ కార్యదర్శిల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించకుండా పారిశుధ్య కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరి కాదన్నారు. ఉద్యోగుల సమస్యలపై త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు.వేములవాడ, యాదగిరిగుట్ట, భద్రాచలం, బాసర, కొమురవెల్లి, కొండగట్టు ఆలయాలకు చెందిన సుమారు 200 మంది ఉద్యోగులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ కార్యవర్గం

● చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు ఎన్నిక


రాష్ట్ర చైర్మన్‌గా గజవెల్లి రమేష్‌బాబు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 25 : రాష్ట్ర ప్రధాన దేవాలయాల జేఏసీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో రాష్ట్రదేవాదాయ ఉద్యోగుల జేఏసీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా మారం జగదీశ్వర్, రాష్ట్ర దేవాలయాల ఉద్యోగుల జేఏసీ చైర్మన్‌గా వేములవాడ రాజన్న ఆలయ ఏఈవో గజవెల్లి రమేష్‌బాబు ఎన్నికయ్యారు. డిప్యూటీ చైర్మన్‌లుగా ఉపాధ్యాయుల చంద్రశేఖర్, బుద్ధి శ్రీనివాస్, సుదర్శన్, గౌరవ సలహాదారులుగా దయాకర్, భాస్కర్, హరికిషన్, కృష్ణ, నమిలికొండ ఉమేశ్‌శర్మ, వరి నర్సయ్య, శ్రీరాములు, వెంకటాచార్యులు, కపీంద్రా చారి, మదన్‌కుమార్, వైస్ చైర్మన్‌లుగా మల్లికార్జున్, నిరంజన్, పీచర రంగారావు, సువర్ణరా ధాకిషన్, శ్రావణ్‌కుమార్, స్వామి, సునీల్‌కుమార్, నవీన్‌శర్మ, ఎడ్ల శివసాయి, కార్యదర్శులు గా గంగా శ్రీనివాస్, కిరణ్‌కుమార్ కోశాధికారిగా సురేంద్రాచార్యులు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా శ్రీధర్‌శర్మ, గోలి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులు గా కట్కూరి వెంకటయ్య, మహేష్, మాధవాచార్యులు, క్రీడల కార్యదర్శిగా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

నరసింహుని ఆలయ హుండీ లెక్కింపు


హుండీ లెక్కిస్తున్న ఆలయ అధికారులు

● ఆదాయం రూ 47.70 లక్షలు

ధర్మపురి, సెప్టెంబరు 25 : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం హుండీ లెక్కింపు బుధవారం నిర్వహించగా 47,70,995 రూపాయల ఆదాయం లభించింది. జూన్ 12నుంచి సెప్టెంబరు 25వరకు గల 105 రోజులకు సంబంధించిన హుండీలు తెరచి లెక్కింపు నిర్వహించగా ఈ ఆదాయం లభించింది. అలాగే 50 గ్రాముల మిశ్ర మ బంగారం, నాలుగు కిలోల 700 గ్రాముల మి శ్రమ వెండి, 90 విదేశీ నోట్లు లభించాయి. కార్యక్రమంలో దేవాదాయ కరీంనగర్ సహాయ కమిషనర్ ఎన్ సుప్రియ, ఆలయఈవో సంకటాల శ్రీనివాస్, సీనియర్ అసిసెంట్ అలువాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆర్య వైశ్య నిత్యాన్న సత్రం కోశాధికారి జక్కు దేవేందర్, యూబీఐ మేనేజర్ ఆశిష్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి బుధవారం వరద నీరు రావడం కొనసాగింది. ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్సారెస్పీలోకి 33,238 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటినిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది.మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 33,238 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో వరద కాలువకు 18,000 క్యూసెక్కులు, రెండు వరద గేట్లు ఎత్తడం ద్వారా 6,248 క్యూసెక్కుల నీరు దిగువకు గోదావరిలోకి వదులుతున్నారు. కాకతీయ కాలువకు 6,800 క్యూసెక్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువకు 1,200 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 50 క్యూసెక్కులు, మిషన్‌భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఇందిరమ్మ వరద కాలువ ద్వారా మధ్య మానేరు రిజర్వాయర్‌కు నీటిని వదులుతున్నారు.

30న హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 25: హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 30న ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు వీర్ల వెంకటేశ్వర్‌రావు, కార్యదర్శి బాసరవేని లక్ష్మణ్ ఓ ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో సీనియర్ బాలురు, బాలికలకు ఎంపిక పోటీలుంటాయన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9నుంచి రంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు క్రీడాకారులు ఒరిజినల్ ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో 30న ఉదయం 10గంటలకు అసోసియేషన్ కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు. వివరాలకు 9441 92807, 8978995730, 9550942180 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

ఎల్ఎల్‌బీ పరీక్ష ఫీజు చెల్లించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 25 : ఎస్‌యూ పరిధిలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం రెండో సెమిస్టర్ విద్యార్థులు పరీక్ష ఫీజుమునన అక్టోబరు 5లోగా చెల్లించాలని ఎస్‌యూ పరీక్షల నియంత్ర ణాధికారి డాక్టర్ ఎన్‌వీ శ్రీరంగప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 300 రూపాయల అపరాధ రుసుంతో అక్టోబరు 9లోగా చెల్లించాలన్నారు. పరీక్షలను అక్టోబరులో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

క్రైం కార్నర్

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

మరొకరికి 10 ఏళ్లు జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 25 : ఓ వ్యక్తి హత్యకు కారణమైన ఇద్దరిలో ఒకరికి జీవిత ఖైదు రూ.2500 జరిమానా, మరొకరికి 10 సంవత్సరాల జైలు శిక్ష రూ.2500 జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రధాన న్యాయమూర్తి ఎన్.ప్రేమలత బుధవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం ముస్తాబాద్‌కు చెందిన పందుగ రాజం తండ్రి రాములుకు పందుగ మరియమ్మకి ఆస్తుల పంపకాల విషయంలో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పందుగ రాజంను 1 సెప్టెంబరు 2020న పందుగ మరియమ్మ ఆమె కుమారుడు పందుగ మల్లేశం గొడ్డలితో నరికి చంపారు. ఈ సంఘనపై అప్పటి సిరిసిల్ల రూరల్ సీఐ సర్వర్ కేసు నమోదు చేశారు. పందుగ మరియమ్మ, మల్లేశంను రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ ఎస్సై రవీంద్ర నాయుడు ఆధ్వర్యంలో కోర్టులో 15మంది సాక్షులను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నర్సింగరావు వాదించారు. కేసు పూర్వాప రాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పందుగ మరియమ్మకి పది సంవత్సరాల జైలు శిక్షతోపాటు రూ.2500 జరిమానా, పందుగ మల్లేశంకు జీవిత ఖైదుతో పాటు రూ.2500 జరిమానా విధించారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

● రికార్డుల్లో మరో వ్యక్తి పేరిట సొంత పట్టా భూమి

గొల్లపల్లి, సెప్టెంబరు 25: మండలంలోని గుంజపడుగు గ్రామంలో తన సొంత పట్టా భూమి గ్రామానికి చెందిన మరో వ్యక్తి పేరిట రికార్డుల్లోకి ఎక్కడంతో ఓ వృద్ధుడు తీవ్ర మనస్తాపం చెంది సదరు నకిలీ పట్టాదారు ఇంటి ఎదుట పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చుక్క లింగయ్య (78)కు గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 74లో 0-14 గుంటల వ్యవసాయ భూమి ఉన్నది. అయితే, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రెవెన్యూ రికార్డుల శుద్ధీకరణ కార్యక్రమంలో భాగంగా లింగయ్య భూమి సాంకేతిక కారణాల వల్ల గ్రామానికి చెందిన నవ్వ రమేష్ అనే వ్యక్తి పేరిట రికార్డుల్లో తప్పుగా నమోదైంది. దీనిపై లింగయ్య రెవెన్యూ కార్యాలయం చుట్టూ, రమేష్ ఇంటి చుట్టు రెండేళ్లుగా తిరుగుతున్నాడు. అయినప్పటికి అధికారులు పట్టించుకోలేదు. అసలు ఆ సర్వే నంబరులో రమేష్‌కు ఎలాంటి భూమి లేకున్నా తన భూమి అన్నట్లు వ్యవహరిస్తూ తీవ్రమానసిక క్షోభకు గురిచేస్తున్నాడని బాధిత కుటుంబసభ్యులు కన్నీళ్లపర్యంతమయ్యారు. ఈ సంవత్సరం మార్చి నెలలో ఎట్టకేలకు పట్టా చేస్తానని రమేష్ చెప్పడంతో ఆన్‌లైన్‌లో ధరణి పోర్టల్‌లో స్లాట్ బుక్ చేసుకున్నారు. అయితే, మళ్లీ పట్టా చేయకుండా తప్పించుకుతిరుగుతున్నాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన లింగయ్య పురుగుల మందు డబ్బాతో రమేష్ ఇంటికి వెళ్లి ఇంటి ముందర పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తమ భూమి తమకు ఇప్పించి న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు సంబంధిత అధికారులను కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాగి వైరు చోరీ

సుల్తానాబాద్, సెప్టెంబరు 25 : సుల్తానాబాద్ పట్టణంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో దొంగతనం జరిగింది. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగుచూసింది. కరీంనగర్ వైపు రాజీవ్ రహదారిని ఆనుకుని శాస్త్రినగర్ ప్రాంతంలో ఉన్న ఈ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతు కేంద్రంలో రాత్రి దొంగలు ముఖాలకు మాస్కులు ధరించి వచ్చి కేంద్రంలోని కిటికీల గుండా లోనికి ప్రవేశించారు. అందులో ఉన్న సీసీ కెమెరాల వైర్లను కట్‌చేసి దొంగతనానికి పాల్పడ్డారు. ట్రాన్స్‌ఫార్మర్లకు చెందిన మూడున్నర క్వింటాళ్ల రాగి వైరును ఎత్తుకెళ్లారు. దీని విలువ దాదాపు నాలుగు లక్షల రూపాయల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పోలీస్ అధికారులు బుధవారం సందర్శించి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఇతర ఆధారాల కోసం అన్వేషించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

● బైక్ చోరీ

ఇంటి ఎదుట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని దొంగలు ఎత్తుకెళ్లిన సంఘటన సుల్తానాబాద్ పట్టణంలోని పూసాల రోడ్డులో చోటు చేసుకుంది. భైరోగని రవీందర్‌గౌడ్ అనే వ్యక్తి తన ఇంటి ఎదుట వాహనం నిలిపి ఉంచగా బుధవారం తెల్లవారి లేచి చూసేసరికి వాహనం కనిపించకుండాపోయింది. వెంటనే సీసీ కెమెరాలు పరిశీలించగా ఓ దొంగ బైక్‌ను ఎత్తుకెళుతున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి.

దొంగతనం కేసులో ఒకరికి జైలు శిక్ష

వేములవాడ, సెప్టెంబర్ 25 : యాభై వేల రూపాయల నగదు దొంగలించిన సంఘటనలో ఒకరికి 18 నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి తీర్పునిచ్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ బుధవారం మీడియాకు వివరించారు. గతేడాది ఆగస్టు 15వ తేదీన వేములవాడలోని మోత్కుపల్లి ఎల్లయ్య అనే వ్యక్తి షాప్‌లోని క్యాష్ కౌంటర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా దండేపల్లి మండలం లక్ష్మీకాంతపురం గ్రామానికి చెందిన కాశెట్టి వెంకటేష్ 50 వేల రూపాయలు దొంగిలించాడు. ఈ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. విచారణ అధికారి ఎస్ఐ అంజయ్య కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సీఎంఎస్ఎస్ఐ రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.. ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి జ్యోతిర్మయి కాశెట్టి వెంకటేష్‌కు 18 నెలల కఠిన కారాగార జైలు శిక్షతో పాటు వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ తెలిపారు.

పిడుగుపాటుతో పేలిన ట్రాన్స్‌ఫార్మర్

శంకరపట్నం, సెప్టెంబరు 25 : శంకరపట్నం మండలం అర్కండ్ల శివారులో పిడుగు ప్రభావంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలింది. గ్రామస్థుల సమాచారం మేరకు మంగళవారం మధ్యాహ్నం వర్షం కురిసిన సమయంలో మెరుపులతో పెద్ద శబ్ధంతో పిడుగుపడి ట్రాన్స్‌ఫార్మర్ పేలినట్లు తెలిపారు.

జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు

జమ్మికుంట, సెప్టెంబరు 25 : జమ్మికుంట పట్టణంలో పెట్రోల్ దొంగలు పెట్రేగి పోతున్నారు. రాత్రి వేళల్లో ఆరుబయట నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాల్లో పెట్రోల్ చోరీ చేస్తున్నారు. పగలు సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను గుర్తిస్తూ రాత్రి వేళల్లో పెట్రోల్ చోరీకి పాల్పడుతున్నారు. నాలుగు రోజుల క్రితం పట్టణ పరిధిలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఒకే రోజు రాత్రి ఇరువై ద్విచక్ర వాహనాల్లోని పెట్రోల్‌ను తీశారు. సుమారు 50లీటర్ల వరకు పెట్రోల్ ఎత్తుకెళ్లినట్లు తెలుస్తోంది. పోలీస్‌లు రాత్రి వేళల్లో గస్తీ పెంచి, పెట్రోల్ చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీవో 25 నిబంధనలు మార్చాలి

గంభీరావుపేట, సెప్టెంబరు 25 : రేషనలైజేషన్ జీవో 25ను నిబంధనలు మార్చాలని, అశాస్త్రీయమైన జీవోను అమలు చేయాలని కలెక్టర్లను పాఠశాల విద్యాసంచాలకులు ఆదేశించడాన్ని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాతూరి మహేందర్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్‌లో మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో 11 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు అదే విధంగా 60 మంది విద్యార్థులకు కూడా ఇద్దరే ఉపాధ్యాయులను కేటాయించాలని పేర్కొనడం అసంబంధమైన విషయమన్నారు. ఇటీవల జరిగిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల్లో పాఠశాల విద్యాశాఖ పాటించిన నిబంధనలను కూడా అమలు చేయక పోవడం పట్ల మహేందర్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. 317లో నష్టపోయిన వారికి సొంత జిల్లాలకు పంపాలని పెండింగ్ బిల్లులు డీఏలు మంజూరు చేయాలని పీఆర్‌సీ ప్రకటించి అమల చేయాలన్నారు. రాష్ట్ర ఈసీ మెంబర్ ఉమా బాలచందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుమాల రామానాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోట్యాగిరి బాల్‌రాజు, కార్యదర్శి కరికె ప్రకాష్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

గవర్నర్ అవార్డుకు ఎంపికైన ఖని విద్యార్థులు


తృతీయ సోపాన్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 25: గోదావరిఖనిలో ఇటీవల జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ శిక్షణ శిబిరంలో స్థానిక జడ్‌పీహెచ్ఎస్ బాలికల పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచి గవర్నర్ అవార్డుకు అర్హత సాధించారు. హర్షవర్ధన్, భానుప్రసాద్, మణిదీక్షిత్, సలీంపాషా, సాయికృష్ణ, కౌశిక్, మారుతి ఎంపికయ్యారు. తృతీ య సోపాన్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యా యులు జింక మల్లేష్, స్కౌట్ మాస్టర్ నీలిమ, ఉపాధ్యాయులు రమ, ఫిజికల్ డైరెక్టర్ కనుకుంట్ల లక్ష్మణ్, అరుంధతి, మనోహర్ శాస్త్రి అభినందించారు.

గంజాయి అమ్మిన వ్యక్తి అరెస్ట్

● 350 గ్రాములు స్వాధీనం


అరెస్ట్ చూపుతున్న సీఐ నిరంజన్ రెడ్డి

మెట్‌పల్లి, సెప్టెంబరు 25 : దారి దోపిడీ కేసులో నిందితులకు గంజాయి అమ్మిన వ్యక్తిని బుధవారం పోలీస్‌లు బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అతని వద్ద నుంచి 350 గ్రాములు గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించాలరు. ఈనెల 21న ఇబ్రహీంపట్నం మండలంలోని బండలింగపూర్ క్రాసింగ్ వద్ద ముగ్గురు వ్యక్తులను రెండు రోజుల క్రితం అరెస్ట్ చేసి విచారించారు. వైఎస్ఆర్ కాలనీకి చెందిన చందు వారికి గంజాయి అమ్మినట్లుగా తెలిపారు. దీంతో మెట్‌పల్లి డీఎస్పీ ఆదేశాలు మేరకు పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. బుధవారం చందు తన ఇంటివద్ద ఉన్నాడని పక్కా సమాచారం మేరకు చందు ఇంటి వద్దకు వెళ్లి పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అతడిని విచారించగా గంజాయి అమ్మినట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న 350 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకోని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిచినట్లు తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యహరించిన మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎస్ఐ అనిల్‌కుమార్, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, రాజును అధికారులు అభినందించారు.

పోలీసుల జోక్యంతో ముగిసిన యువకుడి అంత్యక్రియలు


జగ్గసాగర్‌లోని సమస్యను తెలుసుకుంటున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు 25 : మండలంలోని జగ్గసాగర్ గ్రామానికి చెందిన ఏనుగు ప్రభాస్(19) అనే యువకుడి అంత్యక్రియలు పోలీసుల జోక్యంతో బుధవారం నిర్వహించారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన ఏనుగు ప్రతాప్, అనంతల దంపతుల కుమారుడైన ఏనుగు ప్రభాస్ మనస్తాపానికి గురై ఈనెల 8న ఆత్మహత్య పాల్పడ్డాడు. ఈనెల 24న ప్రభాస్ మృతి చెందాడు. ప్రభాస్ ఆత్మహత్యకు తల్లే కారణమని ఆమెపై గ్రామంలోని కులస్థులు దాడికి పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. యువకుడి తల్లి పేరుపై ఉన్న ఆస్తిని తండ్రి ఏనుగు ప్రతాప్‌పై చేసి న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు నిర్వహించేదిలేదని కుటుంబ సభ్యులు, కులస్థులు పట్టుబట్టారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్సైలు అక్కడి చేరుకుని సమస్యను తెలుసుకున్నారు. తల్లి పేరు మీద ఉన్న ఆస్తి భర్త ప్రతాప్ పేరు రిజిస్టర్ చేస్తేనే అంత్యక్రియలు చేస్తామని పేర్కొన్నారు. పోలీసులు కలగజేసుకుని అంత్యక్రియలు జరిగిన తరువాత కుటుంబస భ్యులు, బంధువులు, కులస్థుల కలిసి సానుకూలంగా మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించుకోవడానికి ఎలాంటి గొడవలు జరగకుండా రక్షణ కల్పిస్తామన్నారు. దీంతో వారు శాంతించి ఆ యువకుడి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు.

త్వరలోనే లబ్ధిదారులకు రేషన్‌కార్డులు : విప్


కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న అడ్లూరి

బుగ్గారం సెప్టెంబరు 25: త్వరలోనే లబ్ధిదారులకు, రేషన్ కార్డులు లేని వారికి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. బుగ్గారం మండలం కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను విప్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడ్లూరి మాట్లాడుతూ బుగ్గారం మండల కేంద్రంలో ప్రభుత్వ శాశ్వత భవన నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. త్వరలోనే రేషన్ కార్డులు మంజూరు చేసి సన్నబియ్యాన్ని పంపిణీ చేస్తామన్నారు. ధర్మపురి నియోజకవర్గ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటానని ప్రజలకు ఏ సమస్య వచ్చిన నేరుగా తనను కలవొచ్చని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ మజీద్, ఎంపీడీవో శ్రీనివాస్, బుగ్గారం, ధర్మపురి మండలాల అధ్యక్షులు వేముల సుభాష్ దినేష్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని నూకపల్లి వద్ద గల ఇందిరమ్మ ఇళ్ల కాలనీలో బుధవారం పారిశుధ్యంపై మున్సిపల్ ప్రజాప్రతినిదులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కాలనీలోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను ఎక్స్‌కావేటర్ సహాయంతో తొలగించారు. కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ పర్యవేక్షించి సిబ్బందికి పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.

ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఉద్యోగావకాశాలు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్‌లో కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదలైనట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి డాక్టర్ కోలక్కంటి రవి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్‌లో ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

రేపు 'టామ్ కామ్' ఆధ్వర్యంలో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25: టామ్‌కామ్ ఆధ్వర్యంలో ఈ నెల 27న ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జగిత్యాల ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. యూఏఈలో మెకానికల్ ఎలక్ట్రికల్ బీఎంఎస్ ఆపరేటర్, ఎంవీపీ టెక్నీషియన్, ఎంవీపీ సూపర్‌వైజర్ తదితర ఉద్యోగాలకు ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసు కోవడానికి అభ్యర్థులు ఐటీఐ డిప్లొమా బీటెక్ ఉత్తీర్ణులై రెండు సంవత్సరాల అనుభవంతో పాటు 20 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలన్నారు. ఆకర్షణీయమైన జీతం ప్యాకేజీతో పాటు సురక్షితమైన చట్టబద్ధమైన వలస మార్గాల ద్వారా రిక్రూట్‌మెంట్ ప్రక్రియ చేయడంలో టామ్‌కామ్ అభ్యర్థులకు సహాయపడుతోందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు 27న వరంగల్‌లోని ములుగు రోడ్డులో గల ఐటీఐ కళాశాల బాలుర క్యాంపస్‌లో జరిగే ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరు కావాలని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలి

జగిత్యాల, సెప్టెంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల, ఏకాగ్రతతో విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం పట్టణంలోని డీఎల్ గార్డెన్స్‌లో జరిగిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చదువులో రాణించి తల్లిదండ్రులు, గురువుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. విద్యార్థులు పలు దేశ భక్తి, సినీ, జానపద గేయాలపై ఆటాపాటలతో ఊర్రూతలూగించారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కొడిమ్యాల, సెప్టెంబరు 25: మండలంలోని డబ్బుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన ఆరుగురు క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపిక కాగా ఏలేటి కమలాకర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన క్రీడాకారులకు బుధవారం దుస్తులను గ్రామ ప్రముఖులు ముత్యంరెడ్డి ద్వారా పంపిణీ చేయించారు. డబ్బుతిమ్మయ్యపల్లిలో వీధిలైట్ల ఏర్పాటుతో పాటు, దోమల నివారణకు 18 వేల రూపాయలతో ఫాగింగ్ చేయించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న చాకలి అయిలమ్మ విగ్రహ ఏర్పాటుకు 10 వేల రూపాయలు రజక సంఘం నాయకులకు కమలాకర్‌రెడ్డి విరాళంగా అందించారు. కార్యక్రమంలో శ్రీనివాస్, మదు, సంజీవ్, మహేష్, రాజయ్య, తదితరులు ఉన్నారు.

దసరా ఏర్పాట్లపై సమావేశం

మల్యాల, సెప్టెంబరు 25: మండల కేంద్రంలో దసరా వేడుకల నిర్వహణపై గ్రామపంచాయతీ అధికారులు బుధవారం కుల సంఘాల ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామ పురోహితులు ప్రణీత్‌కుమార్‌శర్మ దసరా నిర్వహణపై పంచాంగం చూడగా అక్టోబర్ 10న సద్దుల బతుకమ్మ, 12 విజయదశమి నిర్వహణకు గ్రామస్థుల సమక్షంలో నిర్ణయించారు. సమావేశంలో పంచాయతీ ఈవో శ్రీకాంత్ పాల్గొన్నారు

వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా వేయించాలి

పెగడపల్లి, సెప్టెంబరు 25: చిన్నారులకు వ్యాక్సినేషన్ క్రమం తప్పకుండా వేయించాలని, అందుకు వైద్యసిబ్బంది తల్లులకు అవగాహన కల్పించాలని పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. పెగడపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో బుధవారం చిన్నారులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత పాటించాలి

డీఆర్డీవో రఘువరన్

వెల్గటూర్ సెప్టెంబరు 25: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా నిర్వహించే పనుల్లో పారదర్శకత పాటించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్డీవో) రఘువరన్ సూచించారు. బుధవారం వెల్గటూర్ మండల పరిషత్ కార్యాలయంలో 14వ విడత సామజిక తనిఖీలో ఉమ్మడి వెల్గటూర్ మండలంలోని 30గ్రామాల పరిధిలో నిర్వహించిన 7 కోట్ల 33 లక్షల రూపాయల విలువగల పనులకు గాను కూలీలకు వేతనాలు, మెటీరియల్ రూపంలో ఖర్చు చేసినట్లు పేర్కొన్నారు. పనుల్లో తేడా వచ్చిన ఉపాధిహామీ గ్రామస్థాయి సిబ్బందికి, మండల స్థాయి సిబ్బందికి ఐదు వేల రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. కూలీలకు రికవరీ రూపంలో 28, 952 రూపాయలు గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో సీహెచ్ మదన్మోహన్, ఎంపీడీవో విజయలక్ష్మి, అంబుడ్స్‌మెన్ కృష్ణరెడ్డి, డీవీవో చిన్నయ్య, ఏపీవో దేవేందర్‌రెడ్డితదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

రాయికల్, సెప్టెంబరు 25: జిల్లా రైతు ఐక్య వేదిక ఆధ్వర్యంలో అక్టోబరు 4న తలపెట్టిన రైతు రణభేరి చలో కలెక్టరేట్ రైతు ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘాల రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతి రెడ్డి కోరారు. మండలంలోని ఇటిక్యాల, రాయికల్, అయోధ్య, అల్లీపూర్ గ్రామాల్లో రైతులు, సంఘాల నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. రైతులు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు తురగ శ్రీధర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, కురుమ మహిపాల్, బోడిగం శ్రీకాంత్, లచ్చన్న, మల్లారెడ్డి, ముద్దం రాము, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

కోరుట్ల, సెప్టెంబరు 25: పట్టణంలోని వివిధ వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ స్థానిక నాయకులతో కలిసి పలు అభివృద్ధి పనులను బుధవారం ప్రారంభించారు. పట్టణంలోని 20వ వార్డులో మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు హయాంలో మినీ ఫంక్షన్ హాల్‌కు రూ. 10 లక్షల నిధులు మంజూరు చేయగా హాల్ పనులకు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ మంజూరు చేసిన నిధులతో ప్రభుత్వ అసుపత్రిలో ఆర్‌వో వాటర్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభిచారు. 31వ వార్డులో లైబ్రరీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పేర్ల సత్యం, నాయకులు మోహన్‌రెడ్డి, అన్వర్, ఫహీం, అన్వర్, పాల్గొన్నారు.

చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో పెరిగిన భూగర్భ జలాలు

జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

రాయికల్, సెప్టెంబరు 25: మండలంలో ఏడు చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో జలకళతో పాటు భూగర్భ జలాలు పెరిగాయని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని మహితాపూర్ గ్రామంలో ఎంపీ నిధులు రూ.25 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ డీ-52 కెనాల్‌కు తొంబర్రావుపేట వద్ద తూము ఏర్పాటు చేయగా 14 గ్రామాలు సాగునీటి కొరత తీరడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ త్వరగా చొరవ తీసుకోవడం అభినందనీయమని అన్నారు. రాయికల్ పట్టణానికి లైబ్రరీ మంజూరుకు చొరవ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఎంపీడీవో చిరంజీవి, పీఆర్ ఈఈ రహమాన్, తహసీల్దార్ ఖయ్యూం, ఎంపీవో సుష్మా, పీఆర్ ఏఈ వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

● **రైతులు కొత్త పంటలు పండించాలి..**

రైతులు నూతన పద్ధతులు పాటించి కొత్త తరహా పంటలు పండించాలని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని అల్లీపూర్ అనుబంధ గ్రామాల రైతుమిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సభ్యుల సమావేశం రైతు వేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు డిమాండ్ ఉన్న పంటల సాగువైపు ఆలోచన చేయాలన్నారు. అల్లీపూర్ రైతు మిత్ర ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొనుగోలు కేంద్రం కేటాయింపు విషయాన్ని కలెక్టర్, విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్తానని అన్నారు. కార్యక్రమంలో డీపీవో వాణి, ఏవో ముక్తేశ్వర్, చైర్మన్ శేఖర్, మండల నాయకుడు కోల శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

రైతుల క్షేత్ర సందర్శన

రాయికల్, సెప్టెంబరు 25: మండలంలోని అల్లీపూర్ గ్రామంలోని రైతు వేదికల రైతుమిత్ర ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం రైతులు క్షేత్ర సందర్శన చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో వరి పంటకు ఆశిస్తున్న ఎండు తెగులు, సుడిదోమ నివారణ చర్యల గురించి జిల్లా వ్యవసాయాధికారి బి.వాణి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీవో చైర్మన్ శంకర్, ఎంఏవో ముక్తీశ్వర్, పొలాస శాస్త్రవేత్తలు రజని, సాయి కుమార్, మాజీ సర్పంచ్ గంగారెడ్డి, రాజన్న పాల్గొన్నారు.

ధర్మపురి: మండలంలోని గోవింద్‌పల్లె, నేరెళ్ల, దమ్మన్నపేట గ్రామాల్లో వరి, పత్తి పంటలను వ్యవసాయ విస్తరణ అధికారులు కొత్తపల్లి నవ్య, అయ్యోరు అజయ్‌కుమార్ బుధవారం సందర్శించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

కథలాపూర్: వరి, ఆయిల్ పామ్ తోటలపై ప్రస్తుత సీజన్‌లో చీడ పీడల ఉధృతి అధికంగా వచ్చే అవకాశం ఉందని అందువల్ల రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో యోగిత సూచించారు. మండలంలోని తాండ్ర్యాల, ఇప్పపల్లి, తక్కళ్ళపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఏఈఓలు సుష్మశ్రీ, శేఖర్, మౌనిక, సంధ్య, హరీశ్ ఉన్నారు.

పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించాలి

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 25: మండలంలోని జాబితాపూర్ పాఠశాల విద్యార్థులకు తక్షణమే టాయిలెట్స్ నిర్మాణం చేయాలని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ డిమాండ్ చేశారు. జాబితాపూర్ ప్రభుత్వ పాఠశాలను మాజీ జడ్పీచైర్‌పర్సన్ సందర్శించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ విద్యార్థులకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. పాఠశాలలో 139 విద్యార్థులకు ఒకటే టాయిలెట్ ఉండడం బాధాకరమన్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఉన్నప్పుడే రూ. 10 లక్షలు నిధులు కేటాయించినట్లు దావ వసంత పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జలందర్, గంగారెడ్డి, లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, సురేష్, శేఖర్, మహేష్, సంతోష్, సాగర్ ప్రణయ్ ప్రతాప్, సాయి పాల్గొన్నారు.

మండల విద్యాధికారుల నియామకం

రాయికల్, సెప్టెంబరు 25: జిల్లాలోని పలు మండలలాలకు ఎంఈవోలను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాయికల్ మండల విద్యాధికారిగా రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీపతి రాఘవులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీపతి రాఘవులును పీఆర్‌టీయూ టీఎస్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొన్నం రమేష్, కుంబాల శ్రీనివాస్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కన్నవేని మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి దొంతి సతీష్, మండల శాఖ అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం పాల్గొన్నారు.

కథలాపూర్: మండల విద్యాధికారిగా సిరికొండ ఉన్నత పాఠశాలలో పీజీ హెచ్ఎంగా కొనసాగుతున్న లోకిని శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. శ్రీనివాస్ మండల వనరుల కార్యాలయంలో ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించారు.

మల్లాపూర్: మండలం విద్యాధికారిగా కేతిరి దామోదర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాఘవుపేటలోని జడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న దామోదర్‌రెడ్డిని ఎంఈవోగా నియమించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారంగాపూర్: మండల విద్యాధికారిగా బి కిషోర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొండ్ర రాంచందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, కొక్కు గంగారాం, సీఆర్‌పీలు రవి, శోభ, కంప్యూటర్ ఆపరేటర్ నితిన్ పాల్గొన్నారు.

వెల్గటూర్: మండల విద్యాధికారిగా చేగ్యామ్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోనగిరి ప్రభాకర్ బాధ్యతలు స్వీకరించారు.

మల్యాల: మల్యాల మండల నూతన విద్యాధికారిగా ఎస్.జయసింహరావు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన ఎంఈవో అయిత శ్రీనివాస్ మల్యాలతో పాటు కొడిమ్యాల, పెగడపల్లి మండలాల ఇన్‌చార్జి ఎంఈవోగా కొనసాగుతుండగా ఇకపై శ్రీనివాస్ కొడిమ్యాల ఎంఈవోగా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించ నున్నారు. కాగా మల్యాల ఇన్‌చార్జి ఎంఈవోగా పోతారం జడ్పీఉన్నత పాఠశాల హెచ్ఎం జయసింహరావును నియమించారు.

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

రాయికల్, సెప్టెంబరు 25: రాబోయే బతుకమ్మ, దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లను చేయనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు అన్నారు. రాయికల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సమస్య, శివారు ప్రాంతాల్లో వీధి దీపాల ఏర్పాటు గురించి చర్చించారు. బతుకమ్మ నిమజ్జనం, దేవీ నవరాత్రుల ముగింపు రోజున దుర్గాదేవి నిమజ్జనం దృష్ట్యా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. మున్సిపల్ కార్యాలయ భవన నిర్మాణంతో పాటు ఇతర పనులకు కూడా ఈ వారంలోనే ప్రారంబిస్తామని కాంట్రాక్టర్లు తెలిపినట్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి


నివాళులర్పిస్తున్న సత్యనారాయణరావు, నాయకులు

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 25: ఆర్ఎస్ఎస్ మాజీ అధ్యక్షుడు, బీజేపీ సిద్ధాంతకర్త పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు దీన్ దయాల్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ రావు మాట్లాడుతూ 1937లో ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా, 1952లో భారతీయ జంక్షన్ ఆవిర్భావం తర్వాత ఉపాధ్యక్షులుగా జన సంఘ జాతీయ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి దేశానికి ఎన్నో సేవలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అనుమల్ల కృష్ణహరి, బీజేపీ నాయకులు జుంబర్తి దివాకర్, మర్రిపల్లి సత్యం, భూమి రమణ, పెద్ద గంగారాం, బెజ్జారపు ప్రవీణ్, ముంజ శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి: ధర్మపురి మండల కేంద్రంలో బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి తిరుమన్దాసు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబ దేవాలయం వద్ద ఉపాధ్యాయ విగ్రహానికి పూలమాల వేసి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. కౌన్సిలర్ పెండం గణేష్, మ్యాడవేణి నరేష్, సాయిచంద్, బెక్కం అశోక్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి


ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 25: ప్రజాసంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. బుధవారం మండలంలోని జోగినిపల్లిలో మహాలక్ష్మి పథకంలో రూ. 500 గ్యాస్ సిలిండర్ పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందించారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగరావు మాట్లాడారు. మహిళలకు ఆర్థిక భారం తగ్గేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిలిండర్ల సబ్సిడీ ద్వారా అందిస్తోందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, మహిపాల్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, బద్దం నారాయణ, బద్దం గౌతమ్ రెడ్డి, పోతనేని శేఖర్, ఇంద్రాల హరీష్, కొంతం రాజం, అశోక్, శంకర్, సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.

● **రైతులకు నష్టపరిహారం ఇప్పించాలి**

మెట్‌పల్లి రూరల్: మెట్‌పల్లి మండలంలోని గ్రామాల వీదుగా నేషనల్ హైవే 63 భూ సేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు బహిరంగ మార్కెట్ విలువ కంటే ఎక్కువ నష్టపరిహారం ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ప్రభుత్వాన్ని కోరారు. మండలంలోని గ్రామాల్లో విలువైన ఇళ్లు, ఇళ్లస్థలాలు, వ్యవసాయ భూములు కోల్పోతున్న భూనిర్వాసితులకు బహిరంగ మార్కెటు విలువ కంటే ఎక్కువ నష్టపరిహారం ఇప్పించాలని రైతులతో కలిసి మంగళవారం రాత్రి కలెక్టర్ సత్యప్రసాద్‌కు వినతి పత్రం అందజేసి సమస్యను వివరించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మేడిపల్లి, బండలింగాపూర్, వెల్లుల్ల గ్రామాల్లోని రైతు నాయకులు ఉన్నారు.

నీటి వనరులను పరిశుభ్రం చేయాలి

కొడిమ్యాల, సెప్టెంబరు 25: గ్రామాల్లో నీటి సపరా వనరులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గౌతంరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో రెండు రోజులుగా కొడిమ్యాల, మల్యాల మండలాల మంచి నీటి సహాయకుల శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో తాగు నీటి సరాఫరాలో పంప్ ఆపరేటర్ల పాత్ర కీలకమైందన్నారునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. ట్యాంకులను శుభ్రం చేస్తు నీటి కలుషితం ద్వారా వ్యాదులు రాకుండా బ్లీచింగ్ చేయాలన్నారు. నీటి వనరులను శుభ్రంగా ఉంచుతూ లీకేజీలు లేకుండ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ చీఫ్ ఇంజనీర్ అమరేందర్, ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి పాల్గొన్నారు.

● **రికార్డుల తనిఖీ..**

మండల పరిషత్, మండలంలోని శ్రీరాములపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయ రికార్డులను అడిషనల్ కలెక్టర్ గౌతం రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిజిసర్ల నిర్వహణపై సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ తనిఖీ సమయంలో ఎంపీడీవో స్వరూప, ఎంపీవో వాసవి, కార్యదర్శి శ్రీలత, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

గల్ఫ్ కార్మికుల కోసం 'ప్రవాసీ ప్రజావాణి'

కోరుట్ల రూరల్, సెప్టెంబరు 24: గల్ఫ్ బాధితుల కోసం 27వ తేదీన ప్రవాసీ ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను రాష్ట్ర మంత్రులు ప్రారంబించనున్నట్లు గల్ఫ్ కార్మిక సంఘ సభ్యుడు, సీఎస్ఆర్ పౌండేషన్ అధినేత, కాంగ్రెస్ నాయకుడు చెన్నమనేని శ్రీనివాస్ రావు ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. గల్ఫ్ కార్మికుల కొరకు ఏర్పాటు చేస్తున్న ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను గల్ఫ్ బాదితులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ రావు కొరారు.

జగిత్యాల అర్బన్: గల్ఫ్ కార్మికుల కోసం ప్రవాసి ప్రజావాణి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ఎన్ఆర్ఐ సెల్ చైర్మన్ డాక్టర్ బీఎం వినోద్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ఈ నెల 27న ప్రారంభమయ్యే కౌంటర్ ద్వారా ప్రతీ మంగళ, శుక్రవారాల్లో ఫిర్యాదులు స్వీకరిస్తారని తెలిపారు.

మెళకువలు నేర్చుకునేందుకే పోలీస్ డ్యూటీ మీట్

ఎస్పీ అశోక్ కుమార్


పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 25 :సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెళకువలు నేర్చుకునేందుకుగాను పోలీస్ డ్యూటీ మీట్ ఎంతగానో దోహదపడుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో బుధవారం జిల్లా స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది కంప్యూటర్, ఫోరెనిక్స్ సైన్స్, ఫింటర్ ప్రింట్స్, హ్యాడ్లింగ్, లిఫ్టింగ్, బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్, పోలీస్ జాగీలాల తదితర పోటీలు, ఫోటో, విడియో గ్రఫీలు నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బంది తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి, ఆలోచనలను మార్చు చేసుకోవడానికి ఈ డ్యూటీ మీట్ చక్కని అవకాశమన్నారు. డ్యూటీ మీట్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన వారికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డీఎస్పీలు రవీంద్ర కుమార్, రంగారెడ్డి, ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, రఫీ ఖాన్, లక్ష్మీనారాయణ, రాంనర్సింహా రెడ్డి, రవి, సురేష్, ఆర్ఐలు కిరణ్ కుమార్, వేణు ఉన్నారు.

ఎస్పీని కలిసిన ట్రైనీ ఎస్ఐలు..

విధి నిర్వాహనలో అంకిత భావంతో పనిచేసి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. జిల్లాకు నూతనంగా కేటాయించిన ఎస్సైలు బుధవారం ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సైలకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

సంక్షిప్తం సమాచారం

రాయికల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో మండల ఇన్‌చార్జి విద్యాధికారిగా నియమితులైన శ్రీపతి రాఘవులును బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1993-94 పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పొన్నం రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

- జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య మహాసభ పీఆర్‌వోగా రాయికల్ పట్టణానికి చెందిన నాగమల్ల శ్రీకర్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు మైలారపు లింబాద్రి నియామకపత్రాన్ని బుధవారం అందజేశారు.

రాయికల్ పట్టణంలోని ఒడ్డెర కాలనీలో 10వ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తక్కువ బరువు ఉన్న పిల్లల తల్లిదండ్రులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అవగాహన కల్పించారు. బాలామృతం, కోడిగుడ్లు పంపిణీ చేశారు.

జగిత్యాల అర్బన్: జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోస్టర్‌ను ఉద్యమకారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జవ్వాజి శంకర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27న జరిగే సన్మాన కార్యక్రమానికి జిల్లా ఉద్యమకారులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

- జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలలో టీఎస్ కేసీ ఆధ్వర్యంలో టాస్క్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామకృష్ణ, టాస్క్ ఆర్ఎం గంగప్రసాద్ పాల్గొన్నారు.

బుగ్గారం: మండల కేంద్రానికి చెందిన బొడ్డు సురేష్ కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతుండడంతో తనతో పాటు2001-2002 సంవత్సరం పదో వతరగతి చదువుకున్న తోటి మిత్రులు 30,500 రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపల్ నక్క రాజు,గడ్డం రాజు, గైని శ్రీనివాస్, గాలిపేలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కొడిమ్యాల: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో కళాబృందం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిపించారు. కార్యక్రమంలో కార్యదర్శి వంశీధర్, కార్యాలయ సిబ్బంది, కళాబృందం సభ్యులు పాల్గొన్నారు.

- మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల స్వస్తీయ శాఖ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు రక్తహీనత, కంటి పరీక్షలు చేసి అవసరం ఉన్న మందులను మెడిపల్లి మెడికల్ ఆఫీసర్ కె. మహేష్ అందించారు.

- మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న ఎర్రోజు తక్షిల్ అండర్ 19 విభాగంలో క్రికెట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనందున బుధవారం ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ కె వేణు, ఇన్‌చార్జ్ పీడీ భాస్కర్, అధ్యాపకులు సన్మానించారు.

- మండలంలోని అప్పారావుపేట గ్రామపంచాయతీ పరిదిలో అనధికార లే అవుట్స్ భూమిలో గ్రామ కార్యదర్శి ఇంటి నిర్మాణానికి ఇచ్చిన అనుమతిని రద్దు చేయాలని కోరుతూ స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డికి బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు రేకులపల్లి రవీందర్‌రెడ్డి వినతిపత్రం అందించారు.

మల్యాల: మల్యాలలోని మండల విద్యా వనరుల కేంద్రంలో బుధవారం మండల స్థాయి కళోత్సవ్ పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకొని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారు. పోటీల్లో సాయి కీర్తన, అక్షిత, పూజ, శ్రీలత, అనూష, మనస్విని, కావ్యశ్రీ, లహరి, కీర్తన, అశ్విత, వర్షిణీ ప్రతిభ చాటినట్లు మండల విద్యాధికారి తెలిపారు.

- మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదు స్పెషల్‌డ్రైవ్‌ను ఆ పార్టీ నాయకులు నిర్వహించారు. గ్రామాల్లో బూత్ కమిటీ అధ్యక్షులు ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు చేశారు.

జగిత్యాలరూరల్: మండలంలోని తిప్పన్నపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాస ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీడీపీవో మమత, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్లాపూర్ మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.

కథలాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నూతనంగా అమలు చేస్తున్న ప్రీస్కూల్ విధానంతో మంచి ఫలితాలు కనబడుతున్నాయని జిల్లా సంక్షేమాధికారి నరేశ్, జిల్లా పోషణ్ అభియాన్ మధుకుమార్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని సిరికొండ, దుంపెట గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర మానిటరింగ్ టీం సభ్యులు రాహుల్, రావణ్ ఉన్నారు.

- మండలంలోని సిరికొండలో బీజేపీ సభ్యత్వ నమోదు చేపట్టగా బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల: పట్టణంలోని 29వ వార్డులో బీజేపి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు బింగి వెంకటేష్ పాల్గొన్నారు.

- కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌గౌడ్ ను హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

మెట్‌పల్లి: పట్టణంలోని వివిధ వార్డులలోని అంగన్‌వాడి కేంద్రాలను డీడబ్ల్యూవో నరేష్, రాష్ట్ర కోర్డినేటర్ రాహుల్, సీడీపీవో మణెమ్మ తదితరులు పరిశీలించారు. పోషణ మాసం గురించి తెలుసుకున్నారు.

- పట్టణంలోని 190,191 బూత్‌లలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ డా.రఘు బీజేపీ పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్, నాయకులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి: పట్టణంలో ప్రతీ ఒక్కరు శుభ్రత పాటించి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించాలని మున్సిపల్ సిబ్బంది కోరారు. స్వచ్ఛతా హీ సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా 22వ వార్డులో పలు కార్యక్రమాలను చేపట్టారు. ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజిబ్, నిజాం, యువకులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని గుండంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనతడుపుల పుష్పలత, నర్సయ్యను సన్మానించారు. మాజీ సర్పంచ్ మామిడి లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మండలంలోని సిర్‌పూర్ గ్రామానికి చెందిన తండ్రీకొడుకులైన ఆర్ఎంపీలపై స్థానిక తునికి నిఖిల్ అను బాధితుడు మల్లాపూర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. నిఖిల్‌కు జ్వరం రాగా ఈనెల 2న ఆర్ఎంపీలను సంప్రదించాడు. అధిక మొతాదు గల మెడిసిన్ ఇవ్వగా ఆరోగ్యం క్షీణించి వైద్యానికి నాలుగు లక్షల రూపాయల వరకు ఖర్చ అయిందని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై కిరణ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించాడు.

భీమారం: భీమారం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ ఉపాధ్యాయుడు సయిూద్ పాషా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నాడు. ఈ సందర్భంగా పాఠశాలలో ఆర్‌యూపీపీటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సయిూద్ పాషాను ఘనంగా సన్మానించారు.

జగిత్యాల అర్బన్: టొబాకో ఫ్రీ యూత్ కంప్లైంట్ జీరో కార్యక్రమం సందర్భంగా జిల్లా వైద్యాధికారి సమియొద్దీన్ యువతతో ప్రతిజ్ఞ చేయించారు. పట్టణంలోని మోతెవాడ పట్టణ ఆరోగ్య కేంద్రంలో పొగాకు వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు.